సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం, 28, డిసెంబర్, 2024



వెంకటాచలంలో భారీ నిరసన ర్యాలీలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

విద్యుత్ చార్జీలు పెంచేసి జనం నెత్తిన బాదుడే బాదుడు అన్నట్లుగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పోరుబాట పిలుపునకు వేలాది మంది వినియోగదారులు శుక్రవారం రోడ్డెక్కి నిరసన గళం వినిపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శుక్రవారం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ 'పోరుబాట' కార్యక్రమం నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. విద్యుత్ చార్జీలు పెంచనని నమ్మించి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రభుత్వం ఆరునెలలల్లోనే చార్జీలు పెంచిందని ఆందోళనకారులు మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చి పోరుబాటలో పాల్గొన్నారు. కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెంలో చేపట్టిన పోరుబాటకు జనస్పందన వెల్లువెత్తింది. సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలంలోనూ చేపట్టిన ర్యాలీ దద్దరిల్లింది. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో వినూత్నంగా నల్లదుస్తులు ధరించి ఉరితాళ్లతో చేపట్టిన నిరసన ర్యాలీ ఆలోచింపజేసింది. నెల్లూరు రూరల్, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరులో నిరసనలతో హోరెత్తించారు. ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందించారు.

– సాక్షి ప్రతినిధి, నెల్లూరు



బుచ్చిరెడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌.ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ



కందుకూరులో పార్టీ ఇన్‌చార్జి బుర్రా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన ప్రదర్శన



నెల్లూరులో కరెంటు ఆఫీసుకు ర్యాలీగా వెళ్తున్న కాకాణి, ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు

పోటెత్తిన ప్రజాగ్రహం

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన గళం

- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు
- స్వచ్ఛందంగా తరలివచ్చిన వేలాది మంది ప్రజలు
- పాల్గొన్న మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జీలు
- 'పోరుబాట' కార్యక్రమం విజయవంతం



విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న కాకాణి, విజయకుమార్‌రెడ్డి తదితరులు

నెల్లూరు సిటీ..

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నగరంలో వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. మినీ బైపాస్‌లోని మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపం నుంచి మిలీనియం సబ్‌స్టేషన్ వరకు సాగిన ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు నల్ల దుస్తులు ధరించి ఉరి తాళ్లు చేతబట్టి వినూత్న రీతిలో ప్రదర్శన చేశారు.

నెల్లూరు రూరల్..

నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నగరంలోని కరెంటు ఆఫీసు సెంటర్‌లో శుక్రువారం నిర్వహించారు. తొలుత దివంగత సీఎంవైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వందలాది మంది పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులతో ర్యాలీగా కరెంటు ఆఫీసు సెంటర్ నుంచి విద్యుత్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు.



నెల్లూరు నగరంలో లాంథర్ ప్లకార్డుతో మహిళ నిరసన



కరెంటు బిల్లులనే ఉరితాడుగా మెడలో వేసుకొని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు నగరంలో మిలీనియం సబ్‌స్టేషన్‌కు భారీ ర్యాలీగా వెళుతున్న నగర ఇన్‌చార్జి ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు

ఉదయగిరిలో..

ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోరుబాట జరిగింది. స్థానిక ట్యాంక్‌బండ్‌పై ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వందలాది మంది నేతలు, కార్యకర్తలతో ట్యాంక్ బండ్ మీదుగా బస్టాండు వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత మున్సిపల్ బస్టాండు ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీలు ప్రసన్నలక్ష్మి, పీర్ల పార్థసారథి, పి.రాజేశ్వరమ్మ, కమతం శోభ, టి.విజయ భాస్కర్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, పెయ్యల సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

కావలిలో..

కావలి పట్టణంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విద్యుత్ పోరుబాట చేపట్టారు. పట్టణంలోని ట్రంక్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు.



ఆఫీసు గేటుకు తాళం వేసుకుని లోపల నుంచే నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఈ

బుచ్చిరెడ్డిపాళెంలో..

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం బుచ్చిరెడ్డిపాళెంలో నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల మేర నెల్లూరు – ముంబయి జాతీయ రహదారిపై వేలాది మంది ప్రజలతో నిరసన ర్యాలీ చేపట్టి హోరెత్తించారు.

కందుకూరులో..

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమం కందుకూరులో విజయవంతంగా సాగింది. నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

వెంకటాచలంలో..

సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ పోరుబాట చేపట్టారు. కసుమూరు రోడ్డు నుంచి విద్యుత్ సబ్ స్టేషను వరకు వేలాది మంది పార్టీ శ్రేణులతో పాటు విద్యుత్ వినియోగదారులతో భారీ ర్యాలీ నిర్వహించారు.



ఉదయగిరిలో ట్యాంక్‌బండ్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



ఆత్మకూరులో విద్యుత్ డీఈఈ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



కావలిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

న్యాయ విద్యార్థుల మధ్య ఆధిపత్య పోరు

- కళాశాలలోనే డిష్యుం.. డిష్యుం
- పోలీసు స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

నెల్లూరు (టౌన్): వారంతా న్యాయ విద్యార్థులు. భవిష్యత్తులో అన్యాయాన్ని, అధర్మాన్ని ఎదిరించి సమాజంలో పలువురికి ఆదర్శంగా నిలవాల్సిన వారు ఘర్షణకు దిగారు. కళాశాలలో ఎవరికి వారు ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు రెండు వర్గాలుగా చీలిపోయారు. లేని దానికి ఉన్న దానికి ఘర్షణ పడుతూ ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం వీఆర్ న్యాయ కళాశాలలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. దీనికి తోడు ఓ వర్గం వారు బయట నుంచి వ్యక్తులను పిలిపించి మమ్మల్ని కొట్టించినట్లు మరో వర్గం ఆరోపిస్తోంది. వీఆర్ న్యాయ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు చివరి రోజు కావడంతో చేరేందుకు వచ్చిన వారితో పాటు కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో అక్కడ ఉన్నారు. వారి ముందు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు మాట మాట పెరిగి ఇరు వర్గాలకు చెందిన వారు కళాశాలలోనే ఘర్షణకు దిగారు. కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని ఫోన్ నంబరు ఇవ్వాలంటూ మరో వర్గానికి చెందిన నాయకుడు వేధించడంతోనే ఘర్షణ ప్రారంభమైనట్లు చెబుతున్నారు.

కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

వీఆర్ న్యాయ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు తమిళనాడు, పుదుచ్చేరిలతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు న్యాయ కోర్సుల్లో చేరేందుకు వచ్చారు. లా ఎంట్రెన్స్ టెస్ట్ రాయకపోయినా స్పాట్ అడ్మిషన్ కింద సంబంధిత ఫీజు చెల్లిస్తే వెంటనే ప్రవేశం ఇస్తారు. అయితే కళాశాలలో ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ సంఘాల మధ్య ఎప్పటి నుంచో ఆధిపత్య పోరు ఉంది. గతంలో ఘర్షణలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. అడ్మిషన్లు జరుగుతుండటంతో అడ్మిషనుకు వచ్చిన విద్యార్థులను తమ వర్గంలో కలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఎప్పుడూ వారి ఆధిపత్య పోరుపై కళాశాల ప్రిన్సిపాల్ గాని, అధికారులు గాని దృష్టి సారించలేదు. గురువారం జరిగిన ఘర్షణలో విద్యార్థులతో పాటు విద్యార్థినులు సైతం తలపడ్డారు. ఓ వర్గం వారు తీసుకువచ్చిన తమిళనాడుకు చెందిన వ్యక్తులు మాపై దాడికి పాల్పడ్డారని మరో వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు.

ఇరువర్గాల ఫిర్యాదు

కళాశాలలో ఘర్షణకు దిగిన ఇరువర్గాలకు చెందిన వారు 1వ పట్టణ పోలీసు స్టేషనులో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిసింది. అయితే పోలీసులు వీరిపై ఇప్పటి వరకు కేసు రిజిస్టర్ చేయలేదు. సీఐ, ఎస్సైలు వీఆర్ న్యాయ కళాశాలకు శుక్రవారం వచ్చి ఏం జరిగిందన్న దానిపై ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. విద్యార్థులందరినీ సమావేశ పరిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఘర్షణలకు దిగితే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని, కేసులు ఉన్నట్లయితే మీ జీవితాలు నాశనమవుతాయని హితబోధ చేశారు. అయితే ఘర్షణపై విచారించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా కౌన్సెలింగ్ ఇవ్వడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఘర్షణ జరిగింది వాస్తవమే: శ్రీధర్, ప్రిన్సిపాల్

వీఆర్ న్యాయ కళాశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిన మాట వాస్తవమే. అయితే ఈ ఘర్షణ ఎందుకు జరిగిందో నాకు తెలియదు. విద్యార్థులు కళాశాల బయట ఘర్షణ పడ్డారు. పోలీసులు కళాశాలకు వచ్చి ఘర్షణపై ఆరా తీశారు. ప్రస్తుతం కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది.

కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలు

- ఈ నెల 30 నుంచి జనవరి 9 వరకు..
- హాజరుకానున్న 4,690 మంది అభ్యర్థులు
- దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్పీ కృష్ణకాంత్ సూచన


పోలీసు కవాతు మైదానంలో ఏర్పాట్లు

నెల్లూరు (క్రైమ్): పోలీసు కానిస్టేబుల్స్ ఎంపికల్లో భాగంగా ప్రిలిమినరీ రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి 2025 జనవరి 9వ తేదీ వరకు నెల్లూరు నగరంలోని పోలీసు కవాతు మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు ఎస్పీ జి. కృష్ణకాంత్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది జనవరి 22వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ రాత పరీక్షలో 160 పోస్టులకు గాను జిల్లా వ్యాప్తంగా 20,952 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. అందులో 4,690 (3,855 మంది పురుషులు, 835 మంది మహిళలు) ఉత్తీర్ణులై దేహదారుఢ్య పరీక్షలకు అర్హత సాధించారు. వారందరికి ఈ నెల 30వ తేదీ నుంచి ఫిజికల్ మెజర్‌మెంట్(పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్స్(పీఈటీ) విభాగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించనున్నారు.

పరీక్ష ప్రక్రియ ఇలా..

కాల్ లెటర్లోఅభ్యర్థులకు సూచించిన విధంగా నిర్దేశిత రోజుల్లో సమయానికి ముందుగానే పోలీసు కవాతు మైదానానికి చేరుకోవాలి. నిర్ణీత సమయానికి హాజరుకాని వారిని అనుమతించరు. అభ్యర్థి ఒకరిని మాత్రమే లోనికి అనుమతిస్తారు. తొలుత అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. అనంతరం పీఎంటీ, పీఈటీ విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. శారీరక కొలతలు తీసుకుని 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తారు. ప్రతి అభ్యర్థి శారీరక కొలతలతో పాటు పరుగులో ఉత్తీర్ణత సాధించాలి. లేని పక్షంలో అభ్యర్థులను అనర్హులుగా ప్రకటిస్తారు. అర్హత సాధించిన అభ్యర్థులకు 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో ఏదో ఒకదానిలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంది. ఏపీఎస్పీ అభ్యర్థులు రెండింట్లోనూ ఉత్తీర్ణత సాధించాలి.

వెంట తెచ్చుకోవాల్సిన ఒరిజనల్ సర్టిఫికెట్లు

దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, అటెస్టెడ్ జెరాక్స్ కాపీలు (ఒకసెట్)ను విధిగా వెంట తెచ్చుకోవాలని పోలీస్ అధికారులు తెలిపారు.

- ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ మార్క్ లిస్టు
- డిగ్రీ మార్క్‌లిస్టు, ప్రొవిజినల్ లేదా డిగ్రీ సర్టిఫికెట్
- కులధ్రువీకరణ పత్రం, కమ్యూనిటీ సర్టిఫికెట్ (ఆరు నెల్లోపు తీసుకుని ఉండాలి)
- బీసీ అభ్యర్థులు క్రిమిలేయర్ సర్టిఫికెట్ (నోటిఫికేషన్ విడుదల తేదీ తర్వాత తీసుకుని ఉండాలి)
- స్టడీ సర్టిఫికెట్స్ నాల్గో తరగతి నుంచి 10వ తరగతి వరకు
- ట్రైబ్ సర్టిఫికెట్‌లు/ఏజెన్సీ ఏరియా సర్టిఫికెట్, మాజీ సైనికులు (ఎక్స్ సర్వీస్‌మెన్ సర్టిఫికెట్), మెరిటోరియల్ స్పోర్ట్స్ సర్టిఫికెట్.
- కాల్ లెటర్‌లో తెలిపిన స్కోరు కార్డు (ఒరిజనల్ రిజల్ట్)
- స్టేజ్-1, స్టేజ్-2 (ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న) ఫామ్‌లో వివరాలు భర్తీ చేసి తప్పక తీసుకురావాలి

దళారులను నమ్మి మోసపోవద్దు



పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిబంధనల ప్రకారం పాదర్శకంగా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయి. ఈ ప్రక్రియ మొత్తం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, అధునాతన సీసీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతుందన్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. కాల్‌లెటర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరుకావాలి. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. ఎవరైనా అలాంటి మాటలు చెప్పితే వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై చట్ట ప్రకారమైన చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

– జి. కృష్ణకాంత్, ఎస్పీ

నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	రూ.29
సన్నవి	రూ.20
పండ్లు	రూ.12

పౌల్ట్రీ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	115
లేయర్ (లైవ్)	100
బ్రాయిలర్ చికెన్	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	230
లేయర్ చికెన్	170

అమ్మా, నాన్న.. నేను చనిపోతున్నా..

- ఇంట్లో నుంచి వెళ్లిపోతూ ఫోన్
- పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు
- సాంకేతికత ఆధారంగా గుర్తించి పట్టుకొన్న కొడవలూరు పోలీసులు
- మార్కాపురంలోని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగింత
- క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై అప్పుల పాలైనట్లు నిర్ధారణ


ఇంటి నుంచి పారిపోయిన యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కొడవలూరు సీఐ, ఎస్సైలు

కొడవలూరు: అమ్మా, నాన్న.. నేను చనిపోతున్నా.. అంటూ ఇంటి నుంచి పారిపోతూ ఓ యువకుడు తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. అప్రమత్తమైన తల్లిదండ్రులు 112కు కాల్ చేయడంతో ప్రకాశం జిల్లా పోలీసులు సాంకేతికత ఆధారంగా ఆ యువకుడు ఎక్కడ ఉన్నాడో గుర్తించి సమీపంలోని కొడవలూరు పోలీసులకు సమాచారం అందించారు. లారీలో వెళ్తున్న ఆ యువకుడిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన 30 ఏళ్ల యువకుడు శుక్రవారం మధ్యాహ్నం తల్లిదండ్రులకు ఫోన్ చేసి నేను చనిపోతున్నానని చెప్పి కాల్ కట్ చేశాడు. ఆందోనకు గురైన ఆ యువకుడి తల్లిదండ్రులు 112కు కాల్ చేసి సమాచారం అందించారు. అప్రమత్తమైన ప్రకాశం జిల్లా పోలీసులు సాంకేతికత ఆధారంగా ఆ యువకుడు ఎన్‌హెచ్-16పై నెల్లూరు వైపు వెళ్తున్నట్లు గుర్తించి వెంటనే కొడవలూరు ఎస్సై సీహెచ్ కోటిరెడ్డికి సమాచారం అందించారు. సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్సై, తమ సిబ్బందితో కలిసి ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆ యువకుడు హైవేపై లారీలో వెళ్తున్నట్లు గుర్తించి గండవరం సబ్‌స్టేషన్ సమీపంలో ఫ్లైఓవర్ వంతెన వద్ద లారీని ఆపి లారీలో ఉన్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మార్కాపురంలోని యువకుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

క్రికెట్ బెట్టింగ్‌లే కారణం

అదుపులోకి తీసుకున్న ఆ యువకుడ్ని కొడవలూరు పోలీసులు విచారించారు. బీటెక్ వరకు చదివి క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసై అప్పుల ఊబిలో కూరుకుపోయి గత్యంతరం లేక ఇంట్లో నుంచి పారిపోయినట్లు వెల్లడించారు. కుమారుడు సురక్షితంగా తమ చెంత చేరడంతో యువకుడి తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కుమారుడి ప్రాణాలు కాపాడిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

తీవ్రగాయాలతో కారు డ్రైవర్ మృతి


వేణుకుమార్ మృతదేహం

నెల్లూరు (క్రైమ్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ కారు డ్రైవర్ మృతి చెందిన ఘటన కనుపర్తిపాడు క్రాస్ రోడ్డులో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. కల్లూరుపల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎం.వేణుకుమార్ (49), చిన్ని దంపతులు. వారికి ముగ్గురు కుమార్తెలు. ఆయన నగరంలోని అన్నమయ్య సర్కిల్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం పనికి వచ్చి రాత్రి ఇంటికి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి పని ముగించుకుని స్కూటీపై కొండాయపాళెం మీదుగా ఇంటికి బయలుదేరారు. అంబర్ ఉడ్ స్కూల్ సమీపంలోకి వచ్చే సరికి ప్రమాదవశాత్తు స్కూటీపై నుంచి పడ్డాడో? ఏ వాహనమైనా ఢీకొందో? కారణం తెలియదు కాని రోడ్డుపై పడ్డాడు. తీవ్రగాయాలతో ఉన్న ఆయన్ను స్థానికులు అంబులెన్స్ సహాయంలో చికిత్స నిమిత్తం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ మేరకు మృతుడి భార్య సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

ఎస్జీటీలకు పదోన్నతులు

నెల్లూరు (టౌన్): మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల యాజమాన్య పరిధిలోని సెకండరీ గ్రేడ్ టీచర్స్, తత్సమాన కేడర్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 11 మంది, కావలి, గూడూరు మున్సిపాల్టీల్లో ముగ్గురికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు పొందిన వారికి డీఈఓ బాలాజీరావు పదోన్నతుల పత్రాలను అందజేశారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం


దేవేంద్రబాబు మృతదేహం

మనుబోలు: వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వాకాడు మండలం నిడిగుర్తి పంచాయతీ రెడ్డిపాళెం గ్రామానికి చెందిన మల్లాపు దేవేంద్రబాబు (23) పని నిమిత్తం నెల్లూరు వెళ్లి బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద హైవే వంతెన నిర్మాణ పనులు జరుగుతుండడంతో బైక్‌ను స్లో చేశాడు. ఇంతలో వెనకనే వేగంగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మనుబోలు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, పోలీసులు భద్రతా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీవాల కాపరిపై ఎలుగుబంటి దాడి


వైద్యశాలలో చికిత్స పొందుతున్న పోతయ్య

ఉదయగిరి: మండలంలోని జి.అయ్యవారిపల్లి సమీప అటవీ ప్రాంతంలో శుక్రవారం అదే గ్రామానికి చెందిన జీవాల కాపరి సింగనబోయిన పోతయ్యపై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తన జీవాలను మేపుకునేందుకు అటవీ ప్రాంతానికి తోలుకెళ్లాడు. ఆ సమయంలో పొదల్లో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా అతనిపై దాడి చేయడంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. దాని బారి నుంచి తప్పించుకుని రోడ్డుపైకి పరుగులు తీసి గ్రామస్తులకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. దీంతో గ్రామస్తులు పోతయ్య వద్దకు చేరుకుని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న ఈఎస్‌ఐ అధికార బృందం

నెల్లూరు(అర్బన్): నగరంలోని పొదలకూరు రోడ్డులో 2.18 ఎకరాల స్థలంలో ఉన్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీని అదే స్థలంలో విశాలమైన ఆస్పత్రిగా నిర్మించేందుకు ఈ ఎస్‌ఐ కేంద్ర బృందం శుక్రవారం స్థల పరిశీలన చేసింది. ఇటీవల పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలిసి నెల్లూరులోనే 100 పడకలతో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో నెల్లూరుకు మంజూరైన ఈఎస్‌ఐ ఆస్పత్రికి స్థలం సరిపోదనే నెపంతో విజయవాడలోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ అథారిటీ వేరే ప్రాంతంలో నిర్మించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. దీనిపై పరిశీలించి నెల్లూరు జిల్లాలో అధిక పరిశ్రమలు, కార్మికులు ఉన్నందున ఇక్కడే ఆస్పత్రిని నిర్మించాలని కోరారు. దీంతో విజయవాడ నుంచి వచ్చిన రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ) వేణుగోపాల్, కర్తార్‌సింగ్ లక్కీ, డాక్టర్ ప్రదీప్, దత్తాత్రేయ, రవికుమార్, లీలాకుమారితో కూడిన బృందం స్థల పరిశీలన చేసింది.

సాహిత్యం సామాజిక విలువలకు దర్పణం

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరావు


రక్తఘొష పుస్తకావిష్కరణ చేస్తున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు తదితరులు

వెంకటాచలం: సాహిత్యం సామాజిక విలువలకు దర్పణమని, ఆయా కాలాల సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేది కూడా చక్కటి సాహిత్యమేనని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అన్నారు. మండలంలోని కాకుటూరులో ఉన్న వీఎస్‌యూలో సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ, వీఎస్‌యూ తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం లిటరరీ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ రైతు జీవితం విశిష్టత, వ్యవసాయ రంగానికి సంబంధించిన మూలాలు ప్రాచీన సాహిత్యంలోనే కనిపిస్తాయన్నారు. రైతు జీవితం తెలిపే సాహిత్యం ఎంతో విలువైందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనురాధ రామకృష్ణ రచించిన 'రక్తఘొష' పుస్తకాన్ని ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, పలువురు కవులు పాల్గొన్నారు.

నిమ్మ యార్డులో దుకాణాల లీజు వేలం


యార్డులో వేలం నిర్వహిస్తున్న జేడీ శ్రీనివాసరావు తదితరులు

పొదలకూరు : స్థానిక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డులో 10 దుకాణాలకు మార్కెటింగ్ శాఖ అధికారులు శుక్రవారం లీజు వేలం నిర్వహించారు. గుంటూరు రీజియన్ మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు దుకాణాల వేలం ప్రక్రియను పర్యవేక్షించారు. గతంలో ఇక్కడ ఉన్న 10 దుకాణాలకు వేలం పాటలను నిర్వహించినప్పటికీ అగ్రిమెంట్లు చేసుకోలేదని తిరిగి వేలం నిర్వహిస్తున్నట్లు జేడీ వెల్లడించారు. 10 దుకాణాలకు సంబంధించి 22 మంది వేలం పాటల్లో పాల్గొన్నారు. చిన్న దుకాణాలకు ప్రారంభ వేలం రూ.3,700, పెద్ద దుకాణాలకు రూ.5,600 నిర్ణయించింది. వ్యాపారులు పోటీ పడి మూడు దుకాణాలకు అత్యధికంగా రూ.18 వేలు, రూ.26 వేలు, రూ.16,600 వంతున దక్కించుకున్నారు. మిగిలిన దుకాణాలు సాధారణంగా వేలం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. దుకాణాలు దక్కించుకున్న వారు సకాలంలో అగ్రిమెంట్లు చేసుకోవాల్సిందిగా మార్కెటింగ్ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మార్కెట్ ఏడీ అనితాకుమారి, కావలి డీడీ ఎం.శ్రీనివాసులు, ఇన్‌చార్జి సెక్రటరీ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- జెడ్పీ సీఈఓ విద్యారమ


టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విద్యారమ

నెల్లూరు (పొగతోట): రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ విద్యారమ మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయం నుంచి మండలాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అర్జీల సమస్యలు పరిష్కారం కాకుంటే ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో కారణాలను అర్జీదారులకు తెలియజేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

రూ.80 కోట్లతో 1,125 సీసీ రోడ్ల నిర్మాణం

- డ్వామా పీడీ గంగాభవాని


సీసీ రోడ్డును పరిశీలిస్తున్న పీడీ గంగా భవాని

మనుబోలు: జిల్లాలో రూ.80 కోట్లతో 1,125 సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. మండలంలోని చెరుకుమూడిలో పూర్తయిన సీసీ రోడ్డును, నిర్మాణ దశలో ఉన్న మినీ గోకులాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్లు, రూ.30 కోట్లతో నిర్మిస్తున్న మినీ గోకులాలు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడే ప్రశక్తే లేదని, నాసిరకంగా పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీలైనంత మందికి జాబ్ కార్డులు అందజేసి ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి పథకం ఏపీడీ రాజమ్మకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ జలజాక్షి, ఉపాధి పథకం టీఏలు సుప్రజ, గుర్రప్ప, పంచాయతీ కార్యదర్శి కిషోర్ ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

వెంకటాచలం: మండలంలోని తాటిపర్తిపాళెం గేటు వద్ద పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో నిత్యం పేకాట ఆడుతున్నారనే సమాచారాన్ని కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు దాడులు నిర్వహించి, ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1,260 నగదు స్వాధీనం చేసుకున్నారు.